# పప్పులో కాలు

## గుమ్మా ప్రసాదరావు



ఉత్తరాలు వస్తే కొందరు చదవకుండానే అందులో ఏముందో చప్పున పోల్చుకోగలుగుతారు. అప్పారావు ఎవరినైనా వెతుక్కుంటూ వస్తే అతను ఎందుకు వచ్చాడో చాలా మంది ఇట్టే గ్రహిస్తారు. భగవంతుడా ఈ గండం ఎలా గడుస్తుందా అని కొందరు దేముళ్లను ప్రార్థిస్తారు. కొందరు విధిలేక ఎంతో కొంత అతనికిచ్చి బ్రతుకుజీవుడా అనుకుంటారు. గోడకు వేసిన సున్నం లాగే అప్పారావుకిచ్చిన సొమ్ము తిరిగి రాదనేది జగమెరిగిన సత్యం.

తన దగ్గరకొస్తున్న అప్పారావుని చూసి ముందస్తుగా గతుక్కుమన్నాడు వెంకట్రావు. అంతలోనే తెప్పరిల్లి వీడికెలాగైనా బుద్ధి చెప్పాలనుకున్నాడు.

అప్పుల విషయంలో వాళ్లిద్దరు ఉత్తర దక్షిణ ధృవాలు. అప్పారావు అప్పులు తీసుకుని తిరిగి ఇవ్వని కారణంగా ఎందరో స్నేహితులకు దూరమయ్యాడు. అయినా చిన్న నాటి స్నేహితుడన్న గౌరవంతో ఇంత కాలం వెంకట్రావు అతడ్ని భరిస్తూ వస్తున్నాడు.

అప్పారావుని సాదరంగా ఆహ్వానించాడు వెంకట్రావు.

"చాలా రోజులకొచ్చావు. కాఫీ తాగుదాం పద' ' అన్నాడు వెంకట్రావు అంత వరకు తను చూస్తున్న ఫైలుని పక్కకు పెట్టి, జేబులో పెన్ను పెట్టుకుంటూ.

"కాఫీ ఎలాగూ తాగుతాననుకో. నీతో పని పడింది. ఓ గంట పర్మిషను తీసుకుని ఆఫీసు నుంచి నేరుగా వస్తున్నాను" అన్నాడు అప్పారావు.

వెంకట్రావు మాట్లాడకుండా ముందుకి నడుస్తూ ఉంటే అప్పారావు అతడ్ని అనుసరించాడు.

వెంకట్రావు కేంటీనులో ఓ బల్ల మీద కూర్చుంటూ "ఇప్పుడు చెప్పరా నాతో నీకేం అవసరం పడింది" అని అడిగాడు.

రెండు కప్పులు కాఫీకి ఆర్డరిచ్చి "అప్పు ఏమైనా కావాలా?" అని అడిగాడు సూటిగా అప్పారావుని.

"నా ముఖం మీద అప్పు కోసం వచ్చానని రాసి ఉందా?" నీ పాత బాకీ ఇంకా తీర్చలేదు. మళ్లీ అప్పు కోసం రావడానికి నాకూ సిగ్గుగానే ఉంది. అయినా గత్యంతరం లేకపోయింది".

"నా పాత బాకీలు నీకింకా గుర్తున్నాయంటే నాకు ఆశ్చర్యంగా ఉంది. వాటికి నేనేనాడో నీళ్ల ధారపోశాను. అయినా నువ్వన్నావుగా నీ ఋణం ఈ జన్మలో తీర్చలేనని. అప్పారావ్! నాకు తెలియక అడుగుతాను, నాతో సమానంగా జీతం తెచ్చుకుంటున్నావు. ఎందుకురా అప్పులు చేస్తావు. తిప్పలు పడతావు? నువ్వు నా స్నేహితుడివి కాబట్టి నువ్వు అప్పు తీర్చకపోయినా ఏమీ అనుకోవడం లేదు. మొన్నీ మధ్య ఆ ప్రభాకరం నిన్ను నడిరోడ్డు మీద నిలబెట్టి నిన్ను నానా మాటలు అన్నాడట చూసిన వాళ్లు చేప్తే నా తలకొట్టేసినట్లైంది"

. "నా జాగాలో నువ్వుంటె నేనెందుకు అప్పులు చేస్తున్నానో నీకు తెలుస్తుంది. దూషణ భూషణాలు ఈ శరీరానికే కాని ఆత్మకు కావు. ప్రభాకరరావో మరే వెధవో నన్నేదో అన్నాడని నేను బాధపడలేదు. ఒరేయ్ నాకర్జంటుగా అయిదు వందల రూపాయలు కావాలి. ఎందరినో అడిగి లేదనిపించుకున్నాను. ఇప్పుడు నువ్వు కూడా ఇవ్వకపోతే నా భార్యను బ్రతికించుకోలేను"

అప్పారావు అప్పులు చేయడంలోనే కాదు

అబద్ధాలాడడంలోనూ అతను దిట్ట. సగటు మనిషి ఆ అబద్ధాల నిజాలనుకొని కరిగిపోతాడు. అది వాళ్ల దురదృష్టం.

"నువ్వింతగా ప్రాధేయపడలా? నిన్ను ఖాళీ చేతుల్తో పంపడం నాకు మాత్రం సరదానా? సమయానికి ఆదుకోని స్నేహమూ ఒక స్నేహమేనా?"

వెంకట్రావు అలాగంటూ ఉంటే అప్పారావు ఆనందంతో ఉక్కిరిబిక్కిరియ్యాడు. వీడు కూడా మొండి చెయ్యి చూపిస్తాడేమోనని అనుమానించాడు. ఎంతైనా వాడు తన స్నేహితుడు, స్నేహ ధర్మం తెలిసినవాడు. అయితే అప్పారావుకి ఒకందుకు జాలి కలిగింది. తను చెప్పిన అబద్ధాన్ని నిజమనుకొని పాపం పప్పులో కాలేస్తున్నాడు.

"రక్షించావురా! నాకు భార్యా వియోగం తప్పదని బాధపడుతున్నాను. గజేంద్రుని మొర విని ఆదుకున్న శ్రీహరిలా నీవు నన్ను ఆదుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది."

"నీ భార్య ఆపదలో ఉందంటే చూస్తూ ఎలా ఉపేక్ష చేయగలను? నాకు చేతనైన సహాయం చేయడం నా విద్యుక్త ధర్మం. అయితే నీవు పొరపాటు పడుతున్నావు. సమయానికి నా చేతిలో చిల్లిగవ్వలేదు. కాని శంకరరావనే ఓ పరిచయస్తుడు ఉన్నాడు. నీ భార్య చావు బ్రతుకుల్లో ఉందంటే అతడు తప్పక అప్పు ఇస్తాడు. మీ ఆఫీసు నుంచి సరాసరి మా ఇంటికి రా కలిసి వెళ్దాం." అన్నాడు వెంకట్రావు.

అప్పారావు గొంతులో పచ్చి వెలక్కాయ పడింది. తన సంగతి వెంకట్రావు కన్నా తనకే బాగా తెలుసు.

"అదేం ఖర్మమో నాకీ వూళ్లో అప్పు కాదు కదా పచ్చి మంచి నీళ్లు కూడా పుట్టవు. ముక్కు మొహం కూడా తెలియని నాకు ఆ శంకరరావు అప్పిస్తాడనుకోను. ఆ అప్పు ఏదో నీవే అతని దగ్గర తీసుకో. నేను రాత్రి ఏడు గంటలకు మీ ఇంటికి వస్తాను" అన్నాడు అప్పారావు.

"అధైర్యపడకు. ఆ అప్పు నాకనే అడుగుతాను. నువ్వు నాకు తోడుండు. కాదంటే నాకు మాట సహాయం చేద్దువుగాని." అన్నాడు వెంకట్రావు.

"మనం వచ్చి అరగంట పైగా అయింది. మా బాసు నా మీద కారాలు మిరియాలు నూరుతై ఉంటాడు. ఐదున్నరకల్లా మా ఇంటికిరా" అన్నాడు వెంకట్రావు వాచీ చూస్తూ.

"అమ్మో! ఎలా మరచిపోతాను? అవసరం నాది కదా?" అన్నాడు అప్పారావు.

ఆ సాయంత్రం స్నేహితులిద్దరు శంకరరావింటికెళ్లారు. ఇంట్లోనే ఉన్నాడు.

"రండి వెంకట్రావుగారు. ఏమిటలా దారి మరచి వచ్చారు?"

"ఆఫీసు- ఇల్లూ... తీరికేదండీ! ఈనాడు రాకతప్పలేదు. మీరెలాగైనా నన్ను ఆదుకోవాలి" అన్నాడు వెంకట్రావుగారు.

"సార్! అంత పెద్ద మాటలెందుకు? నానుంచి మీరేం సహాయం ఆశిస్తున్నారో చెప్పండి"

"నా భార్య చావు బ్రతుకుల్లో ఉంది. అర్జంటుగా ఆరు వందలు కావాలి. జీతాలు అందగానే మీ డబ్బు పువ్వుల్లో పెట్టి ఇస్తాను" అన్నాడు వెంకట్రావు.

తనుకు కావలసింది అయిదు వందలే అయినా వీడు ఆరు వందలెందుకు అడుగుతున్నాడు? చేతిలో చిల్లిగవ్వ లేదన్నాడుగా. పనిలో పనిగా తనూ ఓ వంద అప్పు తీసుకోవాలనుకుంటున్నాడు కాబోలు. ఎంత అడుగుతే తనకేం? తీర్చవలసింది వాడే కాని తను కాదు కదా? అనుకున్నాడు అప్పారావు.

"మాట సహాయం చెయ్యమన్నానుగా మొద్దులా కూర్చుంటావేమిరా" అని వెంకట్రావు అప్పారావు చెవిలో అన్నాడు.

"అవునండి. మా వాడి భార్య చావు బ్రతుకుల్లో ఉంది. డాక్టరు ఫీజులకు మందులకు అంత డబ్బు అత్యవసరంగా కావాలి. సమయానికి నా దగ్గర లేకపోయింది. అందుకే మీ వద్దకు వచ్చాడు' అన్నాడు అప్పారావు.

"ఇంతకీ మీరు...?"

"అన్నట్లు చెప్పడం మరిచాను. ఇతను అప్పారావు. నా బాల్య స్నేహితుడు. తన దగ్గర సమయానికి డబ్బు లేకపోయినందుకు ఎంతో నొచ్చుకున్నాడు" అన్నాడు వెంకట్రావు.

"వెంకట్రావుగారు, సహాయం చెయ్యడానికి నాకు ఎలాంటి ఇబ్బందీ లేదు. వడ్డీ తీసుకునే సంస్కారం నాకు లేదు. అయితే నాకో సిద్ధాంతం ఉంది. నేనెవరికీ ఊరికెనే చేబదుళ్లు ఇవ్వను."



## సంబరం

చేయబోయే ఆపరేషన్ కోసం అసలే హడావిడిగా ఉన్న డాక్టర్ ఆ రోజే కొత్తగా చేరిన నర్స్ కాంపౌండర్‌లతో అన్నాడు.

"మీరు థియేటర్‌కి పదండి. నేను మీ వెనుకే వచ్చేస్తాను".

"ఏ సినిమాకి డాక్టర్" ఇద్దరూ అడిగారు సంబరంగా?

కె.వి. మధుసూదనరావు (కాకినాడ)

"శంకరరావుగారు, మీరిలాగంటే మావాడిగతేం కాను? వాడి భార్య చావు బ్రతుకుల్లో ఉంది." అన్నాడు అప్పారావు.

"అప్పారావుగారు, మీరు నన్ను అపార్థం చేసుకుంటున్నారు. నేను అప్పు ఇవ్వనని అనడం లేదు. చేబదుళ్లు ఇస్తే చాలా చిక్కులున్నాయి. ఆ డబ్బు రాబట్టుకోవడానికి మన చెప్పులు అరిగిపోతాయి. వాళ్లు మనల్ని ముప్పుతిప్పలు పెడతారు. మనం అవస్థలు పడతాం. కాదంటారా? అందుకే ఎవరికైనా అప్పు ఇచ్చేటప్పుడు ముందు జాగ్రత్త అవసరం. వెంకట్రావుగారు చేతి వాచీయో, ఉంగరమో నా దగ్గర ఉంచి ఆ డబ్బు అప్పు తీసుకుంటే సరిపోతుంది. జీతాలు రాగానే తిరిగి అప్పు తీరుస్తానంటున్నారుగా? అప్పుడు వారి వస్తువు వారికిస్తాను. అలాగైతే మన స్నేహమూ బెడిసికొట్టదు. మీ అవసరమూ తీరుతుంది. వడ్డీ నయాపైసా ఇవ్వనవసరం లేదు".

"అయ్యో! ఎంత పని జరిగింది. వాచీ చెడిపోయిందని ఈ మధ్యాహ్నమే రిపేరుకిచ్చాను. నా దగ్గర ఉంగరమూ లేదు" అన్నాడు వెంకట్రావు.

"వెంకట్రావుగారు, నేను అసహాయుణ్ణి. మన స్నేహం నాలుగు కాలాలు నిలబడాలంటే నేను నా సిద్ధాంతాలను పాటించాలి"

అప్పారావుకి తల తిరిగింది. కథ అడ్డం తిరిగినట్లనిపించింది.

"శంకరరావుగారు, మావాడు ఎగేసే బాపతు కాదు. అన్నమాట ప్రకారం జీతాలు రాగానే మీ అప్పు తీరుస్తాడు. వాడి మాట నమ్మండి. అతని భార్య అనారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొనైనా ఈ సహాయం చెయ్యండి" అన్నాడు అప్పారావు.

"మీరు చెప్పింది నిజమే. కాని తాకట్టు లేకుండా అప్పులిచ్చి నేను అవస్థలు పాలు కాలేను. అంత్య నిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మేలు. అతను మీకు స్నేహితుడేగా! వారి మీద మీకు మాత్రం నమ్మకం లేదా?"

ఇది ప్రతిష్ఠకు సంబంధించిన విషయం. ఇప్పుడు అప్పు అక్కరలేదని వెళ్లిపోతే శంకరరావు ఏమనుకుంటాడు? స్నేహితుడి భార్య చావు బ్రతుకుల్లో ఉంటే నువ్వు ఆ మాత్రం ఆదుకోలేవా అని ముఖం మీదే అడుగుతే తనేం సమాధానం ఇస్తాడు? అప్పారావు గత్యంతరంలేక చేతి ఉంగరం తీసి ఇచ్చాడు. శంకరరావు ఇచ్చిన ఆరు వందల్లో వెంకట్రావు ఒక వంద ఉంచుకొని మిగతాది అప్పారావు చేతిలో పెట్టాడు ఆ ఇంటి నుంచి బయటకొచ్చి.

"సారీ! ఆ శంకరరావు ఇంత అపనమ్మకస్తుడనుకోలేదురా" అన్నాడు వెంకట్రావు.

●